నమస్తే తెలంగాణ

భద్రాద్రి కొత్తగూడెం

5 | ఖమ్మం, సోమవారం 6 మే 2024 | BHADRADRI KOTHAGUDEM


# డీప్‌ఫేక్ ఆడియోలు సమాజానికి పెనుముప్పు

## కొంతకాలంగా నాపై అసత్య ప్రచారం చేస్తున్నారు: పువ్వాడ అజయ్

ఖమ్మం, మే 5: డీప్‌ఫేక్ ఆడియోలు సమాజానికి పెనుముప్పుగా మారుతున్నాయని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. ఇవి సమాజంలో గందరగోళానికి కారణమవుతున్నాయని అన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తన గొంతుతో కూడిన కొన్ని డీప్‌ఫేక్ ఆడియోలు తనవేనంటూ కొంతకాలంగా కొందరు తనపైన అసత్య ప్రచారం చేస్తున్నారని అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇలాగే చేశారని, ఇప్పటి పార్లమెంటు ఎన్నికల్లోనూ ఇలాగే చేస్తున్నారని అన్నారు. తాను మాట్లాడినట్టుగా ఉన్న ఈ డీప్‌ఫేక్ ఆడియోలు ఆగంతకులు సృష్టించినవేనని అన్నారు. ఈ దుష్ప్రచారం చేసే వారిపై చట్టపరమైన, న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇలాంటి డీప్‌ఫేక్ ఆడియోలపై ప్రజలకు మీడియా అవగాహన కల్పించాల్సి ఉంటుందని అన్నారు. కానీ కొన్ని పత్రికలు మాత్రం దురుద్దేశంతో వాటిని ప్రచురిస్తున్నాయని, డీప్‌ఫేక్ ఆడియోలు నిజమని భావించేలా తప్పుడు ప్రచురణలు చేస్తున్నాయని అన్నారు. ఆ ఆడియాలను, కథనాలను తాను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. కృత్రిమ మేధను ఇలాంటి తప్పుడు పనులకు వినియోగించడం ప్రమాదకరమని అన్నారు.

# ఈవీఎంల కమిషనింగ్‌లో తప్పిదాలుండొద్దు

## ఖమ్మం పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ గౌతమ్



ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ వీపీ గౌతమ్

ఖమ్మం రూరల్, మే 5: ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియలో తప్పిదాలు జరుగకుండా జాగ్రత్త పడాలని ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ సూచించారు. మండలంలోని పొన్నెకల్ శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో చేపడుతున్న ఖమ్మం, పాలేరు అసెంబ్లీ సెగ్మెంట్ల ఈవీఎం, వీవీ ప్యాట్ల కమీషనింగ్ పక్రియను ఆదివారం ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. ఖమ్మం అసెంబ్లీ సగ్మెంట్‌లో 36 టేబుళ్లు, పాలేరు అసెంబ్లీ సెగ్మెంట్‌లో 29 టేబుళ్లు ఏర్పాటు చేసి, కమీషనింగ్ ప్రక్రియ చేపట్టి సోమవారం లోగా పూర్తి చేయాలని సూచించారు. ఖమ్మం అసెంబ్లీ సెగ్మెంట్ సహాయ రిటర్నింగ్ అధికారి ఆదర్శ్ సురభి, పాలేరు అసెంబ్లీ సెగ్మెంట్ అధికారి రాజేశ్వరి, తహసీల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌వి అలవికాని హామీలు

- గ్యారెంటీ హామీల అమలులో రేవంత్ సర్కారు విఫలం
- 'రుణమాఫీ' మోసంతో మళ్లీ ఓట్ల కోసం వస్తున్నారు
- అదే ఓటుతో కాంగ్రెస్ నేతలకు గుణపాఠం చెప్పాలి
- కొణిజర్ల రోడ్‌షోలో ఖమ్మం బీఆర్‌ఎస్ అభ్యర్థి 'నామా'



కొణిజర్ల రోడ్‌షోలో మాట్లాడుతున్న నామా, చిత్రంలో వద్దిరాజు

కొణిజర్ల, మే 5: కాంగ్రెస్‌వన్నీ అలవిగాని హామీలని ఖమ్మం పార్లమెంటు నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు విమర్శించారు. మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ సర్కారును గ్రామాల్లో ప్రజలు నిలదీసే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం సాయంత్రం కొణిజర్ల మండలంలో పర్యటించిన ఆయన.. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్‌తో కలిసి మండల కేంద్రంలో రోడ్‌షో, కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి హాజరైన బీఆర్‌ఎస్ శ్రేణులు, ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఆరు గ్యారెంటీ హామీలతో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇన్ని రోజులు గడుస్తున్నా వాటిల్లో ఏ ఒక్క గ్యారెంటీనీ సకాలంలో నెరవేర్చలేదని విమర్శించారు. గత లోక్‌సభ ఎన్నికల్లో కొణిజర్ల మండలంలో తనకు అత్యధిక మెజార్టీ ఇచ్చిన ఇక్కడి ఓటర్లు.. ఈ ఎన్నికల్లోనూ అంతకు మించిన మెజార్టీని అందించి ఆశీర్వదించాలని కోరారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే బానోతు మదన్‌లాల్ మాట్లాడుతూ.. కేసీఆర్ సర్కారులో దేశంలో మరెక్కడా లేనన్ని సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలయ్యాయని అన్నారు. మళ్లీ తెలంగాణ రాష్ట్రం పచ్చగా ఉండాలంటే పార్లమెంట్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు గొంతుక వినిపించాలని అన్నారు. అందుకోసం కారు గుర్తుపై ఓటు వేసి బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు. బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు కూరాకుల నాగభూషణం, ఆర్‌జేసీ కృష్ణ, పోట్ల కవిత, పోట్ల శ్రీనివాసరావు, బోడపోతుల బాబు, దేరంగుల బ్రహ్మం, పాముల వెంకటేశ్వర్లు, రామారావు, షేక్ మౌలానా, మోహన్‌రావు, కిరణ్, మల్లేశ్, నరసింహానాయక్ పాల్గొన్నారు.

## ఖమ్మంలోని బలపాల వాసులతో ఆత్మీయ సమావేశం



బలపాల వాసులతో మాట్లాడుతున్న నామా నాగేశ్వరరావు

ఖమ్మం, మే 5: 'నేను మన ఊరి రైతు బిడ్డను. మీరూ, నేనూ.. బలపాల గడ్డపై పుట్టి పెరిగాం. నేనేంటో మీకు తెలుసు. మీ ఆత్మీయతను మర్చిపోలేను. మళ్లీ గెలిపిస్తే, మరింత సేవ చేయడం ద్వారా మీ అందరి రుణం తీర్చుకుంటాను' అని బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు అన్నారు. నామా స్వగ్రామం మహబూబాబాద్ జిల్లా బలపాల గ్రామం. ఖమ్మంలో స్థిరపడిన బలపాల వాసులతో నగరంలోని ఓ ఫంక్షన్ హాలులో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. బలపాలతో తనకున్న అనుబంధాన్ని పంచుకున్నారు. నామా మాట్లాడుతూ.. బలపాల రైతు బిడ్డగా 25 ఏళ్ల తన రాజకీయ జీవితం తెరిచిన పుస్తకమని అన్నారు. రెండుసార్లు ఎంపీగా ఎంతో అభివృద్ధి చేశానని, మరోసారి అవకాశమిస్తే మరింత చేస్తానని అన్నారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు, బలపాల గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. తొలుత, ఆదివారం ఉదయం ఖమ్మం రాపర్తినగర్ గ్రౌండ్‌లో మార్నింగ్ వాకర్స్‌ను నామా నాగేశ్వరరావు కలుసుకున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటేసి తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. కార్పొరేటర్ దోరేపల్లి శ్వేత తదితరులు పాల్గొన్నారు. అలాగే, తన తండ్రి నామా నాగేశ్వరరావును గెలిపించాలని కోరుతూ ఆయన తనయుడు నామా పృథ్వీతేజ ఆదివారం రఘునాథపాలెం మండలం చింతగుర్తిలో ప్రచారం నిర్వహించారు.

# ముఖ్యమంత్రి వ్యాఖ్యలు ఆక్షేపణీయం

- 'తొండలు వదలడం, గుడ్లు పీకడం' వంటివి చిల్లర మాటలు
- కేసీఆర్ లేని తెలంగాణను ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు
- అందుకే ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు బ్రహ్మరథం పడుతున్నారు
- పార్టీ అభ్యర్థి 'నామా'కు భారీ మెజార్టీ ఇచ్చేందుకు సిద్ధమయ్యారు
- ఖమ్మంలో ఇంటింటి ప్రచారంలో మాజీ మంత్రి అజయ్‌కుమార్

ఖమ్మం, మే 5: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు ఆక్షేపణీయమని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ స్పష్టం చేశారు. సీఎం కుర్చీలో ఉన్న ఆయన.. 'తొండలు వదలడం, గుడ్లు పీకడం' వంటి చిల్లర మాటలు మాట్లాడడం హుందాతనం కాదని తేల్చిచెప్పారు. మాజీ ముఖ్యమంత్రిని ఉద్దేశించి ఇంతటి నీచమైన వ్యాఖ్యలు చేయడం ఎంత వరకూ సమర్థనీయమో ఆయనే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఖమ్మంలో ఆదివారం పర్యటించిన ఆయన.. 49వ డివిజన్ మామిళ్లగూడెంలో ఇంటింటి ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో ఖమ్మం స్థానం నుంచి పోటీ చేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఇల్లిల్లూ తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. టిఫిన్ సెంటర్లు, కిరాణా దుకాణాలు, ఇస్త్రీ షాపుల వద్ద ఓటర్లను వద్ద ఓటర్లను కలిసి వారితో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆచరణకు సాధ్యంకాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. వాటిల్లో ఏ ఒక్క హామీని నెరవేర్చలేకపోయిందని విమర్శించారు. ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డికు పాలనపై అవగాహన లేక దేవుళ్లపై ఒట్లతో నెట్టుకొస్తున్నారని విమర్శించారు. రైతుల రూ.2 లక్షల రుణమాఫీ విషయంలో ఈ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని తూర్పారబట్టారు.



ఖమ్మం హోటల్‌లో పూరీలు వేస్తూ ప్రచారం నిర్వహిస్తున్న అజయ్‌కుమార్

### కేసీఆర్ లేని తెలంగాణను ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు

కేసీఆర్ లేని తెలంగాణను ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారని మాజీ మంత్రి అజయ్ పేర్కొన్నారు. అందుకే ఈ పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో బీఆర్‌ఎస్‌కు బ్రహ్మరథం పడుతున్నారని, పార్టీ అభ్యర్థి నామాకు భారీ మెజార్టీ అందించేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. జిల్లాలో ముగ్గురు మంత్రులున్నా ఖమ్మంలో నీటి కష్టాలను తీర్చలేక పోతున్నారని దుయ్యబట్టారు. ఇకనుంచైనా ప్రజలకు మంచి జరగాలంటే పార్టీ అభ్యర్థి నామా నాగేశ్వరరావును గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. అందుకోసం కారు గుర్తుకు ఓటేయాలని కోరారు. బీఆర్‌ఎస్ నాయకులు పగడాల నాగరాజు, పొన్నం వెంకటేశ్వర్లు, మన్నె వెంకటరమణ, శీలంశెట్టి వీరభద్రం, పవన్, రంగాచారి, కోటేశ్వరరావు, రంగారావు, నల్లమోతు కోటయ్య, వేణు, సుధీర్, ప్రతాప్, శ్రీను పాల్గొన్నారు.

### 420 హామీలతో కాంగ్రెస్ అధికారంలోకొచ్చింది..

420 హామీలతోనే కాంగ్రెస్ పార్టీ ఈ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందని మాజీ మంత్రి అజయ్ విమర్శించారు. ఖమ్మం 3వ డివిజన్ బల్లేపల్లి, 5వ డివిజన్ బొడ్డురాయి సెంటర్, ఎస్సీ కాలనీల్లో స్థానిక కార్పొరేటర్లు, డివిజన్ నాయకులతో కలిసి నిర్వహించిన ప్రచారంలో ఆయన మాట్లాడారు. తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ప్రజలను ఇబ్బందులపాలు చేస్తోందని దుమ్మెత్తిపోశారు. ఇలాంటి కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచాలంటే ఖమ్మంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి నామా గెలవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు.


# చేరువైన పాలన దూరమయ్యేనా?

- కొత్త జిల్లాను తీసేస్తే మళ్లీ కష్టాలు మొదలైనట్లేనా?
- కలెక్టరేట్, మెడికల్ కాలేజీ భవనాలను ఏం చేస్తారు?
- నిధులు రాక అభివృద్ధి తిరోగమనమయ్యే ప్రమాదం
- ఉద్యోగులను పాత జిల్లాలకు పంపి కొత్త ఉద్యోగాలకు మంగళం?
- ఎన్నికల వేళ కొత్త జిల్లాల రద్దు ప్రకటనలపై సర్వత్రా చర్చ
- సీఎం వ్యాఖ్యలపై మండిపడుతున్న జిల్లా ప్రజానీకం



భద్రాద్రి జిల్లా కలెక్టరేట్

భద్రాద్రి కొత్తగూడెం, మే 5 (నమస్తే తెలంగాణ):పోరాడి సాధించుకున్న తెలంగాణను ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి చేయాల్సిన ప్రస్తుత ప్రభుత్వం.. కొత్త జిల్లాలను రద్దు చేస్తామంటూ సరికొత్త డ్రామాలను తెరతీస్తోంది. దీంతో చెంతకు చేరువైన పాలన మళ్లెక్కడ దూరమవుతుందోనని భద్రాద్రి జిల్లా ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో కొత్తగూడెం జిల్లాను తీసేస్తామంటూ సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల చేస్తున్న వ్యాఖ్యలపై మండిపడుతున్నారు. తెలంగాణను తెచ్చిన ఉద్యమ సారథి కేసీఆర్. తొలి ముఖ్యమంత్రిగా అభివృద్ధిలో రాష్ట్రాన్ని తీర్చిదిద్దారు. పాలనను ప్రజలకు మరింత చేరువచేస్తూ కొత్త జిల్లాలను ఏర్పాటు చేశారు. కానీ కేసీఆర్ దూరదృష్టిని సహించలేని ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి.. ఉద్యమనేత ఆలోచనల ఆనవాళ్లు కన్పించకుండా కొత్త జిల్లాలను తీసివేసేందుకు సరికొత్త విధానాలను తెరపైకి తెచ్చే ప్రయత్నాలను మొదలుపెట్టారు. దీంతో జిల్లా అంతటా 'భద్రాద్రి జిల్లా రద్దు' వ్యాఖ్యలపై సర్వత్రా చర్చ జరుగుతోంది. అయితే, చెంతకు చేరిన పాలనను దూరం చేసేందుకు ప్రయత్నిస్తున్న కాంగ్రెస్‌కు.. ఈ లోక్‌సభ ఎన్నికల్లో ఓటు ద్వారా బుద్ధి చెప్పేందుకు జిల్లా ప్రజలు సిద్ధమవుతున్నారు.




### కొత్త జిల్లాను తీసేస్తే మళ్లీ కష్టాలు మొదలైనట్లేనా?

కొత్త జిల్లాను రద్దు చేస్తే దూరపు మండలాల ప్రజలకు మళ్లీ కష్టాలు మొదలైనట్లే అవుతుంది. వాజేడు, వెంకటాపురం, చర్ల, దుమ్ముగూడెం మండలాలు పూర్వ జిల్లా కేంద్రమైన ఖమ్మానికి సుమారు 150 నుంచి 250 కిలోమీటర్ల దూరంలో ఉండేవి. ఏదైనా పని మీద జిల్లా కేంద్రానికి రావాలంటే అంతకుముందు రోజు రాత్రే బస్సు ఎక్కాల్సిన పరిస్థితి. వచ్చిన ప్రజలు అధికారులు కలుసుకోవాలన్నా.. లేదంటే అధికారులు సదరు గ్రామాలకు వెళ్లాలన్నా ప్రహసనమే. ఈ స్వరాష్ట్ర సాధకుడు కేసీఆర్.. సరికొత్త ఆలోచనలో నూతనంగా భద్రాద్రి జిల్లాను ఏర్పాటు చేసి పాలనను ప్రజల చెంతకు చేర్చారు. నూతన కలెక్టరేట్ ఏర్పాటుతో అధికారులందరినీ ఒకే సముదాయంలో అందుబాటులో ఉంచారు. అదీగాక జిల్లాను సమగ్రాభివృద్ధి చేసి అన్ని విధాలా తీర్చిదిద్దారు. దీనికి తోడు కొత్త మెడికల్, నర్సింగ్ కళాశాలను చెంతకు చేర్చారు. అలాగే, మారుమూల గ్రామాల నుంచి బయలుదేరిన ప్రజలు కూడా ఉదయాన్నే జిల్లా కేంద్రానికి చేరుకొని పనులను పర్యవేక్షించుకొని సాయంత్రానికి ఇంటికి చేరుకునేంత వెలుసుబాటు కలిగింది. గ్రామాలకు వెళ్లి వచ్చేందుకు అధికారులకూ సమయం కుదురుతోంది. దీంతో అన్ని విధాలా ప్రజలు మేలు జరుగుతోంది. కానీ కేసీఆర్ ఏర్పాటు చేసిన కొత్త జిల్లాలను తొలగించి ఆయన ఆనవాళ్లను చెరిపేసేందుకు ప్రస్తుత ప్రభుత్వం కంకణం కట్టుకున్నట్లుగా కన్పిస్తోంది. అయితే ప్రస్తుత పార్లమెంటు ఎన్నికల్లో గెలిచేందుకు, కేసీఆర్ ప్రభుత్వ ఆనవాళ్లు చెరిపేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కొత్త జిల్లా తొలగింపు ఆలోచనలపై జిల్లాపై గుర్రుగా ఉన్నారు.

### కొత్త ఉద్యోగాలకు మంగళం?

భద్రాద్రి జిల్లా తొలగింపు ప్రక్రియ చేపట్టడం వల్ల జరిగే పరిణామాలపైనా ప్రజలు అనేక భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. కొత్త జిల్లాను తీసేస్తే ఉద్యోగులంతా మళ్లీ పాత జిల్లాలకు వెళ్లాల్సి వస్తుంది. ఇప్పటికే జోనల్ వ్యవస్థ ద్వారా కొత్త ఉద్యోగాలకు అవకాశం కల్పించడం, ఎవరి జిల్లాలో వారే ఉద్యోగాలు చేసుకునే వీలు కల్పించడం వంటివి కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. సుమారు 5 వేల మంది ఉద్యోగులు కొత్త జిల్లాలో పనిచేస్తున్నారు. అలాగే కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ద్వారా వేలాదిమందికి ఉద్యోగాలు వచ్చాయి. దీంతో అభివృద్ధిలో జిల్లా ముఖచిత్రమే మారిపోయింది. కానీ ప్రస్తుత ప్రభుత్వ తీరును కొత్త జిల్లా తిరోగమనపాలయ్యే ప్రమాదముందని జిల్లా ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### ప్రజలకు పాలనను దూరం చేస్తారా?



చేరువగా ఉన్న పాలనను ప్రజలకు దూరం చేసేందుకు ప్రస్తుత ప్రభుత్వం కంకణం కట్టుకుంది. అప్పుడు వాజేడు నుంచి ఖమ్మం వెళ్లాలంటే అష్టకష్టాలు తప్పేవికావు. రానూపోనూ రెండు రోజులూ ప్రయాణానికే సరిపోయేది. కొత్త జిల్లాలు ఏర్పడ్డాక ఈ ఇబ్బందులు తప్పాయి. గంటలు, నిమిషాల వ్యవధిలోనే ప్రజలు జిల్లా కేంద్రాలకు చేరుకొని పనులు పర్యవేక్షించుకోగలుగుతున్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కుంటి సాకులు చెబుతూ కొత్త జిల్లాలను రద్దు చేస్తామంటే ప్రజలే తరిమికొడతారు.

–రేగా కాంతారావు. బీఆర్‌ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు

### జిల్లాల రద్దు ఆలోచన దుర్మార్గం



ఎవరైనా అభివృద్ధి చేస్తుంటే ప్రజలు స్వాగతిస్తారు. కానీ పాత ప్రభుత్వం మీద కోపంతో చేసిన అభివృద్ధిని ఎవరైనా చెరిపేస్తారా? కొత్త జిల్లాలను తీసివేయాలని ప్రస్తుత ప్రభుత్వం చూడడం దుర్మార్గం. జిల్లా అధికారులు మా గ్రామానికి రావాలంటే అప్పుడు నెలలు పట్టేది. ఇప్పుడు రెండు రోజులకు ఒకసారి వచ్చిపోతున్నారు. పెద్ద జబ్బు వస్తే వెంటనే కొత్తగూడెం వెళ్లగలుగుతున్నాం. మళ్లీ పాత జిల్లాలో కలిపితే తప్పని పరిస్థితిలో ఖమ్మం వెళ్లాలి. అది ఎంతో భారం.

–పొడియం సుబ్బారావు, రామారావుపేట, దుమ్ముగూడెం మండలం

# ఉమ్మడి జిల్లాలో ప్రశాంతంగా నీట్

- గంటన్నర ముందే కేంద్రాలకు విద్యార్థులు
- ఖమ్మంలో 81 మంది గైర్హాజరు



ఖమ్మంలోని పరీక్ష కేంద్రంలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న అధికారులు

ఖమ్మం ఎడ్యుకేషన్, మే 5 : మెడికల్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన జాతీయస్థాయి నీట్ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఆదివారం ఖమ్మం నగరంలో ఐదు కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. విద్యార్థులు నీట్ పరీక్షకు అత్యధికస్థాయిలో జరవుతుండడంతోపాటు నీట్ పరీక్షను గతంలో నిర్వహించిన అనుభవంతో పూర్తిస్థాయిలో సకల సౌకర్యాలు కల్పించారు. నాలుగు కేంద్రాల్లో 3,260 మంది విద్యార్థులకు 81 మంది గైర్హాజరు కాగా 3,179 మంది హాజరయ్యారు. బోర్డు నుంచి ఫ్లయింగ్ స్క్వాడ్స్, ఐదుగురు అబ్జర్వర్స్, కోఆర్డినేటర్ పార్వతిరెడ్డి పరీక్షా తీరును పర్యవేక్షించారు. పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు 11గంటలకే చేరుకున్నారు. 12 గంటల నుంచి విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతించారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ అందించిన గోడ గడియారాలను కేంద్రాల వద్ద ఉంచారు. ఆ సమయం ప్రకారం 12 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు కేంద్రాల్లోకి అనుమతించారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5:20 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. పరీక్షాకేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

**కొత్తగూడెంలో..**



కొత్తగూడెంలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న అధికారులు

కొత్తగూడెం ఎడ్యుకేషన్, మే 5: జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో మొత్తం 1,174 మంది విద్యార్థులకు హాల్‌టిక్కెట్లు జారీ చేయగా 1,125 మంది పరీక్షకు హాజరయ్యారని, 49 మంది గైర్హాజరైనట్లు నీట్ పరీక్షల సిటీ కో ఆర్డినేటర్, పాల్వంచ నవభారత పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎంవీఎస్ రెడ్డి తెలిపారు. పాల్వంచ నవభారత్ పబ్లిక్ స్కూల్ పరీక్షా కేంద్రంలో 696 మందికి 668 మంది, కొత్తగూడెం సింగరేణి మహిళా డిగ్రీ కాలేజీలో 478 మందికి 457మంది హాజరయ్యారు.

# రేవంత్‌రెడ్డీ .. ఖబడ్దార్

- ఉద్యమాల చరిత్ర కేసీఆర్‌ది..
- కారు కూతలు కూస్తే సహించం
- ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చెయ్
- సీఎం రేవంత్‌పై మండిపడ్డ బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, చిత్రంలో ఇన్‌చార్జి పిన్ని వెంకటరమణ

భద్రాద్రి కొత్తగూడెం, మే 5 (నమస్తే తెలంగాణ): ఉద్యమాల చరిత్ర కలిగిన కేసీఆర్‌పై కారు కూతలు కూస్తే సహించబోమని, ఖబడ్దార్.. రేవంత్‌రెడ్డి అని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు మండిపడ్డారు. కొత్తగూడెంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యమనేతపై కారు కూతలు కూస్తే ఊరుకునేది లేదని, హామీల అమలు చేతగాకే కేసీఆర్‌పై అవాకులు చవాకులు పేలుతున్నారని విమర్శించారు. తెలంగాణ సాధకుడిపై తప్పుడు మాటలు మాట్లాడితే కర్రు కాల్చి వాతలు పెడతామని హెచ్చరించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉండి ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. రైతుభరోసా రూ.15 వేలు, రుణమాఫీ ఏమయ్యాయని నిలదీశారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఖమ్మం, మహబూబాబాద్ సీట్లు బీఆర్‌ఎస్ గెలవబోతుందని ధీమా వ్యక్తం చేశారు.

### చిల్లరగా మాట్లాడితే తరిమికొడతాం: పిన్ని

ఉద్యమ సారథిపై చిల్లర మాటలు మాట్లాడితే ప్రజలు తరిమి కొట్టడం ఖాయమని మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి పిన్ని వెంకటరమణ స్పష్టం చేశారు. కల్యాణలక్ష్మికి తులం బంగారం ఎక్కడో చెప్పాలని ప్రశ్నించారు. చేతకాని హామీలను ప్రజలకు ఇచ్చి ఇప్పుడు చేయలేక తిట్ల పురాణం మొదలు పెట్టారని దుయ్యబట్టారు. గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దిండిగల రాజేందర్, బీఆర్‌ఎస్ నాయకులు రాంబాబు, కోలేటి భవానీ శంకర్, సంకుబాపన అనుదీప్, మోరే భాస్కర్, ఉద్యమనాయకులు ఎడ్ల శ్రీను, కర్నె మురళి, రవి, పాయం ప్రవీణ్, దుర్గేశ్ తదితరులు పాల్గొన్నారు.

### అబద్ధాల కాంగ్రెస్‌ను తరిమికొట్టాలి: రేగా

గుండాల, మే 5: అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని తరిమి కొట్టాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరు గ్యారెంటీల్లో అమలు చేయకుండా చేతులెత్తారని దుయ్య బట్టారు. ప్రజా సంక్షేమం కావాలంటే కారు గుర్తుకు ఓటు వేసి పార్లమెంట్ ఎన్నికల్లో మాలోత్ కవితను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో నాయకులు కోలేటి భవాని శంకర్, తెల్లం భాస్కర్, వట్టం రాంబాబు, టీ రాము, గడ్డం రమేష్, గొగ్గెల రాంబాబు, గడ్డం వీరన్న,కుంజ సుధాకర్, నిట్ట రాములు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా అంతటా వర్షం

- ఉరుములు, మెరుపులతో కూడిన చిరుజల్లులు
- మండు వేసవిలో ప్రజలకు ఊరట



ఖమ్మం నగరంలో కురుస్తున్న చిరుజల్లులు, అలుముకున్న మేఘాలు

ఖమ్మం వ్యవసాయం, మే 5 : నెలరోజులుగా భానుడి భగభగలతో అల్లాడుతున్న ప్రజలు ఆదివారం జిల్లావ్యాప్తంగా కురిసిన వర్షంతో ఉపశమనం చెందారు. అధిక ఉష్ణోగ్రత, ఉక్కపోత కారణంగా ఉక్కిరిబిక్కిరి అవుతున్న జనం వాతావరణం చల్లబడడంతో కొంత ఊరట కలిగింది. ఆదివారం ఒక్కసారిగా మేఘాలు అలుముకోవడం ఆ వెనువెంటనే బలమైన గాలులు వీచడం కొద్దిసేపటి తరువాత భారీ ఉరుములు, మెరుపులతో కూడిన చిరుజల్లులు ఖమ్మం నగరంతోపాటు ఆయా మండలాల్లో కురిశాయి. దీంతో ప్రజలు చల్లటిగాలులకు సేదదీరారు. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. ఒకవైపు ఉరుములు, మరోవైపు మెరుపులు తోడు కావడంతో నగరవాసులు కాసింత ఇబ్బందులు పడ్డారు. అయితే కరెంట్ కటింగ్‌తో చిన్నపిల్లలు, వృద్ధులు ఇక్కట్లకు లోనయ్యారు. నగరంలో పాదాచారులు సైతం ఇబ్బందులు పడ్డారు. అక్కడక్కడ హోర్డింగ్‌లు కింద పడడంతో భయందోళనకు లోనయ్యారు. ఏదేమైనా మండు వేసవిలో అలా వచ్చి ఇలా వెళ్లిన వర్షంతో కాసింత ఉపశమనం పొందారు.

**ఇల్లెందు/టేకులపల్లి, మే 5:** ఇల్లెందు మండలం మామిడిగుండాలలో ఆదివారం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. మామిడి కాయలు రాలాయి. గట్ల లక్ష్మి, బొమ్మెర గురవయ్యకు చెందిన రేకుల ఇళ్లు ధ్వంసమయ్యాయి. టేకులపల్లి మండలంలోని చింతోనిచెలక, సంపత్‌నగర్, బోడు, గంగారం తదితర గ్రామాల్లోని మామిడి తోటలు దెబ్బతిన్నాయి. చేతికొచ్చిన కాయలు రాలిపడ్డాయి.



టేకులపల్లి: గాలి దుమారానికి ఇంటి పైనుంచి ఎగిరిపోయిన రేకులు



టేకులపల్లి: చింతోనిచెలకలో నేలరాలిన మామిడి కాయలు